





బలవంతునిదే రాజ్యం. అది ప్రకృతిధర్మం కూడా. బలహీనుడు పేదవాడయితే అతడి గతి ఎలా ఉంటుందో చెప్పడానికి మాటలు చాలవు సాధారణంగా పేదవారిమీద ఎవరి దృష్టి పడదు. కాని బలహీనుడు, పేదవాడు అయిన మనిషినద్ద బలవంతులు కోరదగిన దేమైనా ఉంటే?

**గోవిందరాజు శ్రీనివాసమూర్తి**

మరో మూడుకోసులు నడిస్తేనేగాని బెజవాడ రాదు. కొంపలు మునిగిపోయినట్టు ముసురు పట్టేసింది. పది నిమిషాలు పోతే కన్ను పొడుచుకున్నా కనిపించని కటిక చీకటి అలనుకుంటుంది. నల్లటి తారురోడ్డు చీకటితో పెనవేసుకుంటుంది.

"తట్నుండమొయ్యి, ముసురట్టేసింది. కాత్తెందరాళ్లే బయల్దేరమంటే, ఇన్నా?" అన్నాడు ముత్యాలు మొదటి పెళ్లాం నరిసితో

రెండడుగుల వెనకాలే తారురోడ్డుమీద భర్తనను సరించి నడుస్తూన్న నరిసికి చిరుకోపం వచ్చేసింది.

"తాగిందంతా డొక్కలో జోగులాడుంటే ఊపిరాట్టాడ తెగిసినా? ఒళ్ళు అదిరేటట్టు బాదినా ఉపట్టాన కదిలినా? పైగా, నేనంట! ఇదిగో, నీ ముద్దుల పెమ్మ ఉందిగందా? ముత్తాబుకే అయిపోయె ఓ తాము" అన్నది.

ముద్దులగుమ్మ అసలు పేరు చింతాలు. ఆ పేరు నాగోలేదని 'సీతాం' అని మార్చేశాడు ముత్యాలు. నోరు తిరక్క 'చీతాం' అయి కూర్చుంది చింతాలు. అది ముత్యాలుకు రెండో పెళ్లాం. అదంటే వాడు పడి ఛస్తాడు!

నరిసికి ఒక అడుగు వెనకగా నడుస్తూన్న సీతాంకి ఒళ్ళు మండింది.

"సల్లంగ, నామీద తోయ్ తల్లా. అయినా, మునిల్దొక్కనైయాకా, నీ సూపులన్నీ నా ముత్తాబు మీదుండక ఏం జేస్తయితే ... నడు, నడూ" అంటూ ఒక్క తోపు తోసింది నరిసిని. ఒక్క ఉదుటులో ముత్యాలుమీద వాలింది నరిసి.

"నీ, నన్నానులు. అవతల ఓరెత్తిపోతాఉందని నే నస్తాఉంటే..." నరిసిని మోచేత్తో ఓ పోటు పొడిచాడు ముత్యాలు. కోపంగా కాదు. సరసంతోనూ, చిరాకుతోనూ మిళాయించిన మెత్తటి, తియ్యటి గట్టి పోటు అది. కిసుక్కున నవ్వింది నరిసి.

అవతల నిజంగానే ఓ ఉరుము ఉరిమింది. తటుక్కున ఓ మెరుపుకూడా మెరిసింది. ముత్యాలు గుండె ఒక్క క్షణం జలదరించింది.

"మొగానికి నవ్వు కూడానూ" అని వెటకారం చేసింది సీతాం. ఈ వెటకారాలు అలవాటే నరిసికి. ఆమెకు మరీ నవ్వు వచ్చేసింది. ఈ ముగ్గురికీ ఓ గజం వెనకాలే వస్తూన్న గాడిద ఈ నవ్వును చూసో, మరెందుకో గట్టిగా ఓండ్రపెట్టింది.

"అదిగో, అట్టుంది నీ నవ్వు" అంది సీతాం.

"నీ, పో" అంటూ దాని జుట్టు పీకింది నరిసి.

ముత్యాలుకు చిరాకెత్తిపోయింది.

"పగలగొయ్యాలిద్దర్నీ" అని చెయ్యెత్తబోయాడు. కాని సీతాం నవ్వు చూసి వాడికీ నవ్వు వచ్చేసింది.

అప్పటికి చీకటి పడనే పడింది. సీతాం కళ్లలో తప్ప మరెక్కడా వెలుగు లేదు. ఆ వెలుగులోనే ముందడుగులు వేస్తున్నాడు ముత్యాలు. రెండడుగుల వెనకాలే నరిసి, ఆమెకు ఓ అడుగు వెనకాల సీతాం, ఆమెకు ఓ గజం వెనకాల గాడిద. గాడిదమీద వారి తాటాకు పటం జామా. అలా ఓ ఫర్లాంగు నడిచారేమో, ముత్యాలు నుదుటిమీద టప్పుని ఓ చినుకు పడింది.

"ఓరి, బాబో!" అన్నాడు ముత్యాలు.

మరో రెండు చినుకులు, పది...ఇరవై...

"నరిసీ, మూటిప్పు" అన్నాడు ముత్యాలు హడావిడిగా.

అప్పటికే మూట విప్పుతున్నది నరిసి. సీతాం ఆ పనిజోలికి పోదు. అలా చినుకులు మీద పడుతూంటేనే ఆమెకు తన్మయత్వం.

"చెట్టుకాళ్ళే నిలబడకపోతే కాత్తి ఒళ్ళొంచదాదూ" అన్నాడు ముత్యాలు.

సీతాం కిచకిచలాడింది.

ఇక దాన్ని ఆజ్ఞాపించలేదు ముత్యాలు!

ఆరు వెదురు బద్దలు, నాలుగు గజాల తాడు, పదడుగుల తాటాకు చాప, ఒక దళసరి కంబళి — నిమిషాలమీద కొంప లేచిపోయింది.

పక్కనడున్న చెట్టుకు గాడిదను కట్టేసి కొంపలోకి

దూరాడు ముత్యాలు. అప్పటికే నరిసి, సీతాం ఓ మూల ఒదిగి కూర్చున్నారు. లోపల అంధకారం!

"సీసా యాడుంది?"

"ఓరికి తెలుసబ్బా, ఎతకాల్సిందే."

ఎలాగైతేనేం, వెతికి ఇవతలకు తీసింది ఆముదం సీసాని. వత్తిచేసి కొంపకు దీపం పెట్టింది రెండో ఇల్లాలు సీతాం.

అప్పటికి బయట హోరున కురుస్తున్నది వర్షం. కంబళీమీద పడిన చినుకులు మెత్తగా జారి చెవి చివళ్లను అంటుకుని ముత్యాల్లా టప్ టప్‌మని భూమిని తాకుతూన్నాయి. సీతాం ముఖం సంబరంతో ఇంతైంది.

"నవ్వుంటేనే ఓ ఎలుగే ఎర్రిమొగవాఁ" అని దాని బుగ్గన గిల్లాడు ముత్యాలు.

"సా, చిగ్గు లేకపోతే సరి" అని మోటుగా నవ్వింది నరిసి.

"ఎప్పటి కాగుద్దో ఏంటో!" అన్నాడు ముత్యాలు.

"ఇగ నెప్పుడాగితే నేంటెహె, తొంగుంటే పోలా" అని ఆవలించేస్తున్నది నరిసి.

"చా, నిద్రమొగవాఁ" అని దాని ముక్కుపుచ్చుకు లాగాడు ముత్యాలు.

"ముసిల్దాంతో ఏం సరసాలాడతావులే" అంది సీతాం.

ఈ మాటతో ముత్యాలుకు మతిపోయింది. అప్పటి కప్పుడే సీతాంమీదికి మనసు పోయింది. ఇదేం కొత్త కాదు ముత్యాలుకు. అలా క్షణక్షణానికీ దానిమీద అతడి మనసు పోతూనే ఉంటుంది. గోవాడ తిరణాల్లో అది మొదటిసారి సత్రవులో కనిపించినప్పుడు పోయిన మతి, పోయినట్టుగానే ఉంది కాని మళ్లీ తిరిగి రాలేదు. తన చేతులతో ఆమెను బంధించిన క్షణంలో ఈ లోకాన్నే మరచిపోతాడు ముత్యాలు. జన్మజన్మాలూ అలానే ఉండిపోవాలనీ, ఆమె పెదవులు అతడికి చెప్పటి, తీయటి కబుర్లు చెప్పాలనీ అతడి అణువణువునా ఉండే కోరిక.

కాని ఆ కోరికలోనే ఒక భయం!

తనకింత ఆనందాన్నిస్తూన్న ఈ సీతాం ... ఒక వేళ ... ఒకవేళ ... ఒకవేళ ...

"అమ్మో!" గబుక్కున దాన్ని దగ్గిరికి తీసుకున్నాడు. అదిరి పడ్డది సీతాం.

"సీ, మోట సరసం ... ఎదవ" పైకే అనేసింది సీతాం.

బయట ఉరుములతో ఆకాశం ఊగిసలాడి పోతున్నది. మెరిసిన ప్రతి మెరుపూ గుడిసెలో తళుక్కున మెరుస్తున్నది. సీతాం కళ్లు విద్యుత్కాంతి ప్రసరిస్తూనే ఉన్నాయి.

ఆ ఉరుము మెరుపులలోంచి మెరిసిన ఒక మెరుపులో పైనుంచి దిగివచ్చినట్టుగా ఒక వ్యక్తి రూపం గుడిసె ముందు ప్రత్యక్షమైంది. ఆ రూపాన్ని ముందు నరిసి చూసింది. ముత్యాలును గోటితో గిల్లింది. గతుక్కుమని ముత్యాలు ఆ వ్యక్తివైపు తేరిపార చూశాడు.

పాతికేళ్లు నిండని పసుపుముఖం ఆ వ్యక్తిది. మెలితిప్పిన మీసం అంత చీకటిలోనూ పొందాగా కనిపిస్తున్నది. తెల్లటి చొక్కా పూర్తిగా తడిసిపోయి, ఒంటిని అతుక్కుపోయింది. నల్లటి పాంటు చీకటిలో కలిసిపోయింది. తడిసిన జుట్టు చంపలకు అంటుకుపోయింది.

"నో...వారూ" అన్నాడు ముత్యాలు.

"ఓరున వాన బడ్తాఉంటే..." అన్నాడు వ్యక్తి.

"ఏం సెయ్యమన్నా?"

"లోసి కొచ్చేదా?"

"మాకే సరిపోక సస్తాఉంటే..."

"ఎట్టనో సద్దుకపోదాంలే..."

నరిసవంక చూశాడు ముత్యాలు. సీతాంవంక చూసింది నరిసి. ముత్యాలువంక చూసింది సీతాం. లోపలికి రమ్మని చెప్పమన్నట్టు సైగ చేసింది. ఇక ఆ సైగకు తిరుగులేదు!

"సరే, ఏడు. ఏం జేత్తాం" అన్నాడు ముత్యాలు.

చొక్కున గుడిసెలోకి దూరాడు ఆ వ్యక్తి.

ఇదంతా నిమిషాలమీద జరిగిపోయింది.

గుడిసెలోకి దూరిన వ్యక్తి చేత్తోనే తల తుడుచుకుంటూ "యూ ఊరు మంది?" అని అడిగాడు.

"జగ్గయ్యపేటలే. అద్సరే, నే నడగాల్సిందిబోయి నువ్వడగుతూంటంటా?" అన్నాడు ముత్యాలు. ఆ గుడిసె తనదనీ, దానిలోకి జొరబడిన వ్యక్తిని యజమానిగా తను వెయ్యవలసిన ప్రశ్న అది అనీ అతడిలో ఓ చిన్న అహం చెలరేగింది.

"మందాప్పూరంటా?" అని అడిగాడు.

"ఓ ఊరని ఏం ఏడ్చిందిలే. ఇయ్యాలీడ, రేపు బెజవాడ, ఎల్లుండి ఇసాకపట్నం, అనక మెద్రాసూ."

> ప్రేమ చంద్రుని వంటిది. వృద్ధి చెందనప్పుడు క్షీణిస్తుంది.
>
> —ఠాగూర్

"ఓరబ్బో!" అంది సీతాం. దాని ముక్కుపుటాలు ఇంత లావైనాయి. మెద్రాసు పేరు వినేటప్పటికి దాని ఒళ్ళు జలదరించింది.

"ఏం చేస్తా ఉంటా?" అన్నాడు ముత్యాలు.

"బిజినెస్సులే."

"అంటే?"

"యాపారం. మీకేం తెల్సేదునుద్దిలే. మీరేం జేస్తారూ?"

"సవరాలు...సవరాలల్లుతాం. యూం పేరూ?"

"ఉస్తాద్ భీమారావు" అన్నాడా వ్యక్తి.

"కుత్తీలు పడతావేట్రా?"

"ఏదోలే."

"బక్కగున్నవ్, నువ్వే కుత్తీలు పడతా?" అంది సీతాం. ఆమెకు క్షణక్షణానికీ ఆ వ్యక్తిమీద కుతూహలం ఎక్కువౌతున్నది.

"ఇప్పుడట్టనే ఉంటదిలే. బర్లోకి దూకానంటే సిరేత్తాను. తెల్లారాక పొక్కా ఇప్పి ఒళ్లిరిసి సూపిత్తాలే" అన్నాడు ఉస్తాద్ భీమారావు.

"ఓరబ్బో!" అంది సీతాం.

"అయితే తెల్లారేదాకా కదలవన్నమాట!" అన్నాడు ముత్యాలు. అతడు ఈ భీమారావును త్వరగా అవతలికి పంపితేనేగాని, సీతాం కళ్లకేసి మక్కువగా చూడలేడు. వానరాత్రి వృథా అయిపోతున్నదని అతడికి బెంగ పట్టుకుంటున్నది.

"తగ్గితే అట్టనే పోతాలే" అన్నాడు భీమారావు. అతడికి వాన తగ్గదని తెలుసు.

అతణ్ణి అవతలికి వెళ్ళిపొమ్మనే ధైర్యం లేక పోయింది ముత్యాలుకు. సాటివాడయిరి!

"సవరాలమీద ఎంత గిట్టుద్ది రోజుకి?" అన్నాడు భీమారావు.

"ఇంత నే ముందిలే, ఒక్కోరోజు మూడు సరదా అమ్మానంటే యాభైరూపాయల్దాకా గిడతై. సగ్గీ ఇగ నంతే. ఒక్కోసారి నెల్లోజుల్దాకా ఒక్కటి కొనే ఆడకూతురుండదు. ఇగ కట్టినయ్యన్నీ బుజాన యేసుకు తిరగాల" అన్నాడు ముత్యాలు.

నరిసి అప్పటికే కాస్త జోగుతున్నది. పొద్దుటినించీ నడిచిన నడకకు ఒళ్లంతా కదిలిపోయింది ఆమెకు. నాలుగు నెలలుగా లోపల ప్రాణం పోసుకుంటున్న జీవి కూడా అలోమంటున్నాడేమో, ఆమెకు మరీ కళ్లు మూతలు పడుతున్నాయి.

"అయితే ఆ యాభైతో బండి లాగుతున్నావన్న మాట. ఈళ్లిద్దరూ పెళ్లాలేనా?" అన్నాడు ఉస్తాద్.

దానికి సమాధానం చెప్పలేదుగాని సిగ్గుతో తల వంచుకున్నాడు ముత్యాలు.

"సర్లే, సర్లే, సిగ్గెందుకూ — అబ్బోసి—బలే గుందిలే" అన్నాడు ఉస్తాద్ భీమారావు సీతాంవంక చూసి.

ముత్యాలుకు గుండెలో బాకు దిగింది.

"ఏది?" అన్నాడు కంగారుగా.

"అదే...అదే. ..మీ కొరస" అని తప్పుకున్నాడు ఉస్తాద్. అతడి కళ్లలోని తళుకు ఇట్టే పట్టేసింది సీతాం.

"నిన్న బెజవాడలో కాలెట్టానో లేదో, ఇట్టే దొరికి నయియ్యి వందరూపాయలూ, మొన్న రాజమండ్రిలో ఓ వంద కొట్టేశాను—కుస్తీల్లోలే. ఇగ రేపో మాపో హైదరాబాదెల్లాల."

"మరి రెండొందలు సంపాయించినోడివి, ఈ నడకేం కర్మ?" అన్నాడు ముత్యాలు.

"బస్సు దొరికి సస్తేగా?"

"అవే, బస్సు దొరక్కపోతే ఏం జేస్తాడేంటి?" అని సీతాం ఉస్తాద్‌ను సమర్థించేసింది.

ఆ మాటకు ముత్యాలుకు గుండెల్లోంచి వణుకు ప్రారంభమైంది. అందుకే సీతాం అంటే అతడికి వల్లమాలిన భయం. ఊసరవెల్లిలా ఏ క్షణాన ఏ రంగు ఫిరాయిస్తుందో అతడికే తెలియదు. అది తనతో వచ్చేసే రోజు గుర్తుకు వచ్చింది. అవతల చెట్టంత వాణ్ణి ఇట్టే వదిలేసి తన చొక్కా పుచ్చుకు వచ్చేసిన సీతాం అంటే అతడికి గుండెదడకాక మరేమిటి? అమధ్యన సూర్యాపేట సత్రవులో ఓ కుర్రకుంక ఎవడో దీన్ని పట్టుకు వేళ్లాడిపోతే వాడి కబుర్లు తప్ప మరొకటి మాట్లాడని సీతాం అంటే ఎంత కంపరం పుట్టుకు వచ్చిందని! ఒకరోజు నందిగామలో ఆ వెధవ ఎవడితోనో వెంటపడి పరిగెత్తేదాకా వస్తే ఆ పేటప్పటికి తలప్రాణం తోకకు వచ్చింది గద! 'ఇగ దీనో ఎట్టా యేగాలో ఏందో' అని అనుకోని రోజు లేదుగద!

"ఊ—ఏందా వాగుడు?" అన్నాడు ముత్యాలు ఆజ్ఞాపిస్తున్నట్టు.

అదిగో, అటువంటి సమయాలలోనే సీతాంకి చిరాకెత్తుతుంది. ముత్యాలంటే కోపం వచ్చేస్తుంది. 'తనను

కట్టడిలో పెట్టేందుకు ఈ వెపదంట?' అను కుంటుంది.

"ఆమెమాత్రం ఏమందంటలే" అన్నాడు ఉస్తాద్ భీమారావు. అప్పటికి తన చొక్కాచేతులు పైకి మడిచి కండలను ఉబ్బపెట్టి అలా అలా ఆడించేస్తున్నాడు. అవి చూస్తూ ఉండిపోయింది సీతాం.

"ఆట్ట చెప్పయ్యా!" అనికూడా అంది.

ముత్యాలుకు ఒంటిమీద జ్వరులు పోయాయి. అంత గగుర్పాటులోనూ ముచ్చెమటలూ పోశాయి. ఆ బయలుద్దేరేది మరోగంట ముందు. బయలుదేరితే ఈపాటికి బెజవాడ జేరిపోదురు. ఈ మజిలీ ఉండేది కాదు. ఈ బోడి ఉస్తాదు తారసిల్లేవాడు కాదు. సీతాం వాణ్ణి చూసి మురిసిపోయే స్థితికీ వచ్చేదికాదు.

ఉరిమిన ఉరుముల్నీ, మెరిసిన మెరుపుల్నీ, కురుస్తూన్న ప్రతి చినుకునీ ఏకబిగిని తిట్టేసుకుంటున్నాడు ముత్యాలు.

"నడు, ఈడనుంచి నడు" అని అందామని నోటిదాకా వచ్చింది కాని, ఆ కదిలే కండల్ని చూసో, సాటి మానవుడన్న జాలికొద్దో ఆ మాట అనలేకపోయాడు ముత్యాలు.

ఇక నేం చేయాలి?

ఆరాత్రి అలా గడిపెయ్యాల్సిందే!

ఆ రాత్రే కాదు, అలాంటివి ఎన్ని రాత్రులు గడవాలో!

బయట వర్షం ఉధృతంగానే కురుస్తున్నది. తాము కూచున్న నేల అంతా తడిసిపోయింది. గొంతుక కూర్చునే నరిసి గుర్రు కొట్టేస్తున్నది. ఉండి ఉండి బయట గాడిద ఓండ్ర పెడుతున్నది. సీతాం ఉస్తాద్ భీమారావు కండలవంక చూస్తూనే ఉన్నది. ఉస్తాద్ ఏవో కబుర్లు చెబుతూనే ఉన్నాడు. బూతులు ధారాళంగా దొర్లిపోతున్నాయి. ముత్యాలుకు గుండె భగభగ మండుతూనే ఉంది!

అప్పటికి రాత్రి పదకొండు దాటి ఉండవచ్చు.

"మూస్కో, నా రాజా, ఓ పట్టు పట్టాల" అంటూ ఎప్పుడు తీశాడో, ఓ సీసా బయటికి తీశాడు ఉస్తాద్ భీమారావు. బిరడా తియ్యటంతోనే నోటికి కరుచుకుని ఒక గుక్కవేసి "అబ్బ, పానం లేగిసొచ్చింది" అన్నాడు.

"ఏందది? ఏందది?" అన్నాడు ముత్యాలు ఆదుర్దాగా.

"మందు — కావాలా?"

ముత్యాలుకు ముఖం ఇంతైంది. గబుక్కున సీసా అందుకుని నోటికి కరుచుకున్నాడు.

"మొత్తం లాగి పారెయ్యకు" అంటూ సీసా లాక్కుని సీతాంకు అందించాడు ఉస్తాద్. అది ముత్యాలువంక ఒక చూపు చూసి, కొప్పు ఊడతీసి జడ విలాసంగా భుజంమీదికి లాక్కుని సీసా అందుకుంది.

"అది జడా? కోడెతాచా?" అన్నాడు ఉస్తాద్.

కిలకిల నవ్వింది సీతాం.

రవరవ మండిపడ్డాడు ముత్యాలు.

"ఆ జడ అసలు నరుకేనా, లేక అమ్ముడుగాని సవరాలన్నీ చుట్టేశావా?" అన్నాడు ఉస్తాద్.

"ఛ, ఈ జడ తీత్తే ముప్పై సవరాలకు సరిపడా జొట్టుంది" అంది దర్జాగా సీతాం.

"ఓరయప్పో!" అన్నాడు ఉస్తాద్.

అప్పటికి ముత్యాలుకు మత్తు వచ్చేసింది. సన్నగా కునుకు వస్తున్నది. ఆ అదునులోనే ఉస్తాద్ భీమారావు చూసీ చూడనట్టు తన చెయ్యి సీతాంకు తాకించాడు. మరో మూడు నిమిషాలకు సీతాంకూడా తన కాలిగోరు ఏమీ ఎరగనట్టు ఉస్తాద్‌కు తాకించింది. ఇద్దరూ ముసిముసినవ్వులు నవ్వుకున్నారు.

మరో రెండు గంటలు పోయాక తన కాళ్ళకింద పూర్తిగా తడిసిపోయినట్టు తెలిసి, గబుక్కున మెలకువ వచ్చింది ముత్యాలుకు. కళ్ళు నులుముకుని చూస్తే నరిసి గురక పెడుతున్నది. మరుక్షణంలో అతడి గుండె బేజారయిపోయింది.

అక్కడ సీతాం లేదు!

ఉస్తాద్‌కూడా లేడు!

కంగారుగా బయటికి పరిగెత్తుకు వచ్చి "సీతాం" అని పొలికేక పెట్టాడు ముత్యాలు.

అయిదు నిమిషాలు అలికిడి లేదు వర్షం చినుకుల శబ్దం తప్ప.

తరవాత వావలో తడిసి వస్తూన్న సీతాం ఎదురైంది. కిమ్మనకుండా గుడిసెలో దూరింది.

"యాడికెళ్ళా?" ముత్యాలు అరిచిన అరుపుతో గుడిసె ఊగిసలాడిపోయింది! పరిసరం మారుమోగింది.

సీతాం ఉలకలేదు, పలకలేదు.

వెనువెంటనే ఉస్తాద్ భీమారావు వచ్చాడు. అతడి ముఖంలో విజయగర్వం తొణికిసలాడుతున్నది. విజయం సాధించిన ఉస్తాద్‌లా ఉన్నాడతను.

"ఛీ, ఛీ ఏం బతుకులు!" అని తుపుక్కున ఉమ్మేశాడు ముత్యాలు. అతడి నరనరాలూ కోపంతో కంపించిపోతున్నాయి.

నరిసి నిద్రమత్తుతోనే బయటికి వచ్చింది.

ఉస్తాద్ నవ్వుకుంటూ గుడిసెలో దూరాడు.

దూరాన ఎక్కడో పిడుగు పడింది.

ముత్యాలు దేహంలో కొన్ని నరాలు తెగిపోయాయి.

పైనించి ధారాపాతంగా కురుస్తూన్న వర్షానికి అతడు పూర్తిగా తడిసిపోయాడు. కాని అతడికి చలి లేదు. పైగా గుండెల్లోంచి వేడి! గుండెలు పగిలే వేడి! ఆ వేడికి తట్టుకోలేక అతడి గుండె పెటుక్కున పగిలింది. ముక్కుపుటాలు పొగలు గక్కుతున్నాయి.

కాని, కాని... కొద్దిక్షణాల్లో అతడి ఒళ్ళు చల్లబడిపోయింది. అతడి గుండెలమీది కుంపటి తొలగిపోయింది!

ఇక అతడు గుడిసెలోకి పోలేదు. కొన్ని ఏళ్ళుగా తనకు ఇంత రక్షణ కల్పిస్తూన్న ఆ గుడిసెవంక అతడు చూడలేకపోయాడు. దానిని వదులుకున్నాడు. దానితోనే తన వెలుగును వదులుకున్నాడు.

తారురోడ్డుమీదికి ఎక్కాడు ముత్యాలు.

భారంగా అడుగులు వేసుకుంటూ రోడ్డంటే వెళ్ళిపోతున్నాడు. ఏం జరిగిందో తెలియకుండా కంగారుగా అతడివెంట పరిగెత్తింది నరిసి.

ఇది ఎప్పుడు గమనించిందో ఏమో, చెట్టుకు కట్టి ఉన్న గాడిద తాడు విప్పుకుని యజమానిని అనుసరించింది!

తడిసిన ముత్యాలు మనసు చల్లగా, ఆహ్లాదంగా ఉన్నది. నడుస్తూనే ఉన్నాడు ముత్యాలు.

దూరంగా ఆకాశం సన్నగా విప్పుకుంటున్నది. ★

# సంక్రాంతి రేఖలు

## మిరియాల రామకృష్ణ

పెరటిదొడ్లో
జామికొమ్మలమీద ఎగిరే
ఆకుపచ్చని చిలుక జంటలు
నన్ను పిలిచాయి!
సుఖస్వేచ్ఛలు నన్ను పిలిచాయి!

కుప్పనూర్చే కూలి కన్నుల
ధాన్యరాసులు పలుకరించాయి!
భావికాలపు వన్నెచిన్నెలు
పలుకరించాయి!

బంతిమొక్కల నవ్వుపువ్వుల
బుగ్గ బంగరుటంచు గాలులు
ఇంటి గుమ్మంముందు అందం
పంచిపెట్టాయి!
జ్ఞాపకాలను పంచిపెట్టాయి!

పొంచిచూచే పొగరుచలినీ,
మించిపోయే మంచుపొగనీ
గొబ్బిమంటలు తరిమివేశాయి!
శత్రుసంతతి తరిమివేశాయి.

వెలుగుతెస్తూ సూర్యకాంతులు
మకరరాశిని వశం చేసుకు
శాంతి నిచ్చాయి!
సంఘశక్తికి క్రాంతి నిచ్చాయి!

ఇంటివాకిటి రంగవల్లిక
కొత్తవెలుగుకు బాట చూపింది!
నవ్య మానవజాతి ప్రగతికి
బాట చూపింది!

ఆడుబిడుచుల ఆకుపచ్చని
చీర రంగులు
స్త్రీసమాజపు శీలశక్తికి
మూర్తి నిచ్చాయి!
శుభోదర్కత
స్ఫూర్తి నిచ్చాయి!

రేపువచ్చే సూర్యకాంతులు
ఆర్తజనులకు
-అనదకేకకు
అభయహస్తం ప్రసాదిస్తాయి!
అసురకోటికి నిద్రనిస్తాయి! *